క్లుప్తంగా

అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇటీవల విడుదలైన ఎంసెట్ ఫలితాల్లో అగ్రీ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 24వ ర్యాంకు సాధించిన రేవూరు నిషితను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం అభినందించారు. నెల్లూరులోని ఆయన కార్యాలయంలో ఆదాలను నిషిత కలిసి తన విద్యకు ఆర్థిక సహకారాలు అందించి ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఈఓ సుప్రియకు డాక్టరేట్



నెల్లూరు (టౌన్): సైదాపురం మండల ఎంఈఓగా పనిచేస్తున్న వి.సుప్రియకు డాక్టరేట్ లభించింది. ఆమె ప్రొఫెసర్ ఉషారాణి పర్యవేక్షణలో ఉమెన్ స్టడీస్ విభాగంలో ఇన్‌ఫ్లుయన్స్ ఆఫ్ హోమ్ అండ్ స్కూల్ ఎన్విరాన్‌మెంట్ ఆన్ ది వాల్యూస్ ఆఫ్ అడోలసెంట్ గర్ల్స్–ఏ కల్చరల్ స్టడీ అనే అంశంపై పరిశోధన గానూ శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

ఫీజు రాయితీ కల్పించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

నెల్లూరురూరల్: అన్ని ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు గురువారం కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇచ్చేలా చూడాలని కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే డీఈఓకు ఫోన్ చేశారని, ప్రభుత్వాదేశాల ప్రకారం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు దయాశంకర్, ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు కాజా శ్రీధర్ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు



మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (పొగతోట): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఇంజినీరింగ్ శాఖల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతామని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీనాథ్ అన్నారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డిప్లమో ఇంజినీరింగ్ అధికారుల అసోసియేషన్ కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడారు. రాష్ట్ర సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశామని, జిల్లా ప్రెసిడెంట్‌గా తనను, వైస్ ప్రెసిడెంట్‌గా పి.పెంచలయ్య, జనరల్ సెక్రటరీగా కేవీ కోటేశ్వరరావు, కోశాధికారిగా జి.శ్రీనాథ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



నెల్లూరు రూరల్: గిరిజన యానాది విద్యా చైతన్య వేదిక నాయకులు కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో గురువారం కలిసి విద్యా చైతన్య యాత్రల పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యాత్ర ద్వారా యానాదుల్లో అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తామన్నారు. మేయర్ స్రవంతి, చైతన్య వేదిక వ్యవస్థాపకుడు పులి చెంచయ్య పాల్గొన్నారు.

రంగడికి జ్యేష్టాభిషేకం నేడు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారికి శుక్రవారం ఉదయం 9 గంటలకు తేనెతో జ్యేష్టాభిషేకం, సాయంత్రం గోపురోత్సవం జరుగుతుందని ఈఓ ఎ.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

కరపత్రాల పంపిణీ

నెల్లూరు రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల సుపరిపాలనపై స్థానిక చిన్నబజార్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ గురువారం ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. కరపత్రాలను అందజేసి బీజేపీ విజయాల గురించి వివరించారు. పార్టీ నాయకులు దువ్వూరు పరుశురామ్, హేమంత్‌కుమార్, శౌరి శ్రీనివాసులు, రాజ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం

నెల్లూరు(అర్బన్): యోగా వల్ల ఆరోగ్యకర జీవనం సాధ్యమని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నేతాజి సుబ్బారెడ్డి, వీఆర్సీ లాఫింగ్ క్లబ్ సెక్రటరీ షేక్.రియాజ్ అహ్మద్ అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వీఆర్సీ గ్రౌండ్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వీఆర్సీ వాకర్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మాస్టర్ బీ.వెంకారెడ్డి పర్యవేక్షణలో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశమే యోగాను ప్రపంచానికి పరిచయం చేసిందన్నారు. యోగా వల్ల శ్వాస, శరీరం, మెదడు అనుసంధానమై ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు, న్యాయవాది నన్నే సాహెబ్, క్లబ్ అధ్యక్షుడు బందారు సుబ్బారెడ్డి, నేతలు ప్రసాద్, శివబాలసుబ్బారావు, వెంకటేశ్వరరావు, తాజుద్దీన్, కె.విజయకుమార్, ఒ.వి జయకకుమార్, శ్రీనివాసన్, పెంచలయ్య, నరసింహశాస్త్రి, రవికుమార్, ఎల్‌కే రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాఘుఆచారి పాల్గొన్నారు.



యోగా చేస్తున్న లాఫింగ్ క్లబ్ సభ్యులు

బీఈడీ కళాశాలలో..

నెల్లూరు (టౌన్): స్థానిక సంతపేటలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో యోగాంధ్రా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులపై యోగాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ, సదస్సును ఏర్పాటు చేశారు. యోగాను జీవితంలో భాగంగా చేసుకుంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రణవ యోగా సంస్థ గురువు ఆనందరెడ్డిని సత్కరించారు. ఫిజికల్ డైరెక్టర్ రవీంద్రబాబు, అధ్యాపకులు లక్ష్మీప్రసన్న, యలమందరావు పాల్గొన్నారు.

సంయుక్తంగా నిర్వహించాలి

నెల్లూరు(బారకాసు): ఈనెల 21న యోగా దినోత్సవం సందర్భంగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రతో పాటు యోగాంధ్రను సంయుక్తంగా నిర్వహించాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్ట్ లీలారాణి సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని గాంధీనగర్‌లో ఉన్న మెప్మా అర్బన్ కార్యాలయంలో పొదుపు మహిళలతో ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ శనివారం ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు వార్డు స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎంపిక చేసిన ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అన్ని సచివాలయాలు, పార్కులు, కార్యాలయాల్లో, పాఠశాలల్లో మొక్కలు నాటాలన్నారు. పర్యావరణాన్ని పెంపొందించేలా యోగా నినాదాలతో ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఎక్కడా ప్లాస్టిక్ వాడకుండా క్లాత్ మ్యాట్స్ వినియోగించాలని, ఆర్గానిక్ స్నాక్స్‌ను అందించాలన్నారు.



బీఈడీ కళాశాలలో..



పొదుపు మహిళలతో మాట్లాడుతున్న మెప్మా పీడీ లీలారాణి

స్వర్ణాల ఘాట్‌ను పరిశుభ్రంగా ఉంచండి

- కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గా గంధ మహోత్సవాలను పురస్కరించుకుని స్వర్ణాల చెరువులోని గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి, ఘాట్ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక బారాషహీద్ దర్గా స్వర్ణాల చెరువు ప్రాంతంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను కమిషనర్ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలై 6 నుంచి ప్రారంభం కానున్న రొట్టెల పండగను పురస్కరించుకొని దర్గా ప్రాంగణం అత్యంత పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. స్వర్ణాల చెరువును పరిశుభ్రంగా ఉంచేందుకు గుర్రపు డెక్క, ఆకును పూర్తిస్థాయిలో తొలగించి, ఘాట్ పరిసర ప్రాంతాల్లో నీరు స్వచ్ఛంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఘాట్ ప్రాంతంలోని నీటిలో ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించి, వ్యర్థాలు వేయకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనంతరం స్థానిక స్టోన్‌హౌస్‌పేట 8/2 సచివాలయాన్ని కమిషనర్ సందర్శించారు. ప్రాపర్టీ ట్యాక్స్ రీసర్వే పనుల రికార్డులను తనిఖీ చేశారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం లక్ష్మీసాయి నగర్, చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు, నారాయణ మెడికల్ కళాశాల రోడ్డు తదితర ప్రాంతాల్లోని భవనాలను కొలతలు వేసి అసెస్మెంట్ డిమాండ్‌తో సరిపోల్చి చూశారు. అనుమతుల మేరకే భవన నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



స్వర్ణాల చెరువు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

‘తల్లికి వందనం’పై అడ్డంకులు సృష్టించొద్దు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి సంబంధించి అడ్డంకులు సృష్టించకుండా అమలు చేయాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి చాలా మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమకాలేదన్నారు. సొంతిల్లు లేనివారికి విద్యుత్ మీటర్లు ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపడంతో చాలా మందికి ఈ పథకం రాలేదన్నారు. దీంతో మహిళలు పాఠశాలలు, కరెంటాఫీసుల చుట్టూ తిరుగుతున్నారని, ప్రభుత్వం స్పందించి అర్హులైన ప్రతిఒక్కరికీ తల్లికి వందనం పథకాన్ని అందించాలన్నారు. నాయకులు షానవాజ్, అజీజ్‌అహ్మద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

డ్రాపౌట్లను బడిబాట పట్టించేలా చర్యలు

నెల్లూరు(బృందావనం): ప్రస్తుత విద్యాసంవత్సరంలో డ్రాపౌట్ అయిన విద్యార్థుల వివరాలను సేకరించి వారిని తిరిగి బడిబాట పట్టేందుకు జమాఅతె ఇస్లామీ హింద్ చర్యలు చేపడుతుందని ఆ సంస్థ నగరాధ్యక్షుడు సయ్యద్ నవీద్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు ఆయన పాఠశాలల డ్రాపౌట్ విద్యార్థుల సమాచార జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి అధికారికంగా గురువారం సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ఇంటింటికీ వెళ్లి వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకుని విద్యా ప్రాధాన్యతను వివరించి వారిని బడిబాట పట్టించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.అన్వర్‌బేగ్, హమీద్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయం నుంచి జాబితాను స్వీకరిస్తున్న నిర్వాహకులు

సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన

నెల్లూరు (టౌన్): వచ్చేనెల 3వ తేదీ వరకు సికిల్ సెల్ అనీమియాపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి సుజాత తెలిపారు. రాజాగారి వీధి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు ఎస్టీలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్లలోపు వారికి స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 1,58,392 మంది ఎస్టీలను గుర్తించామని, వారికి రెండు వారాల్లోపు స్క్రీనింగ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ప్రాజెక్టు మేనేజర్ మల్లికార్జున రెడ్డి, ఏ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, జిల్లా లెప్రసీ మెడికల్ ఆఫీసర్ సురేంద్రబాబు, హెల్త్ సెంటర్ డాక్టర్ నాగేంద్ర పాల్గొన్నారు.



రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు

నెల్లూరు(బారకాసు): ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తను రోడ్లపై వేయకుండా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ చైతన్య శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక హరనాథపురంలో పారిశుద్ధ్య కార్మికుల హాజరును ఆయన గురువారం పర్యవేక్షించారు. ప్రతి వార్డులో వ్యాపారాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని, ప్రతి సెక్రటరీ తమ సచివాలయ పరిధిలోని అన్ని వీధులకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ స్ట్రీట్ డేటాను తయారు చేయాలన్నారు. అపార్ట్‌మెంట్ల వద్ద చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదని ఫిర్యాదు వచ్చిన కారణంగా స్థానికంగా సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లో ఒక లాగ్ బుక్‌ను నిర్వహించేలా చర్యలు చేపడుతామని తెలియచేశారు.



అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడుతున్న ఎంహెచ్‌ఓ చైతన్య

నేటి నుంచి ఎన్‌సీసీ శిక్షణా శిబిరం

నెల్లూరు (టౌన్) : విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 20వ తేదీ నుంచి 29వ తేదీ వరకు తొమ్మిదో ఎన్‌సీసీ నావెల్ వార్షిక శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు అనంతపురం జిల్లాలకు సంబంధించిన వివిధ కళాశాలలు, పాఠశాలల ఎన్‌సీసీ నావెల్ క్యాడెట్లు హాజరుకానున్నట్లు వెల్లడించారు. శిక్షణా శిబిరంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, భావిభారత వీర సైనికులుగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరుకావాలన్నారు.

రేపు సామూహిక యోగా కార్యక్రమాలు

నెల్లూరురూరల్: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహిక యోగా కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా యోగా వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

వివాదాస్పద భూమి మఠానికి అప్పగింత

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని మెడికవర్ హాస్పిటల్ నుంచి గూడూరు వైపు వెళ్లే మార్గంలో సర్వే నంబర్ 295లోని ఓ వివాదాస్పద భూమిని రెవెన్యూ అధికారులు అహోబిలం మఠానికి స్వాధీనం చేశారు. రికార్డులను సర్వే చేసి మఠానికి అప్పగించారు. దీంతో మఠానికి చెందిన నిర్వాహకులు ఆ భూమిలో గురువారం బోర్డులను ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయమై రూరల్ తహసీల్దార్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తాము సర్వే చేసి అహోబిలం మఠానికి చెందినదిగా గుర్తించి వారికి అనుమతులిచ్చామన్నారు.

చికెన్ వేస్ట్ వాహనాలను అడ్డుకుంటాం

- జనసేన నాయకుల వెల్లడి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో చికెన్ వేస్ట్ వాహనాలను అడ్డుకుని తీరుతామని జనసేన నగరాధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు అన్నారు. మాగుంట లేఅవుట్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో చేపల సాగు చేస్తున్న రైతులు లాభాల కోసం చికెన్ వర్థాలను ఉపయోగిస్తున్నారన్నారు. దీనివల్ల భూములు కలుషితం కావడంతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. చికెన్ వేస్ట్ తరలిస్తున్న ముఠాపై, ఉపయోగిస్తున్న రైతులపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సర్వేపల్లి నాయకుడు సురేష్‌నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో తడ నుంచి వెంకటాచలం వరకు చికెన్ వ్యర్థాలను తరలిస్తే అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రజలే తరలివచ్చి చికెన్ వేస్ట్ కట్టడికి సహకరించాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

- కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో పాటు వేగవంతంగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్లను పర్యవేక్షించాలని కమిషనర్ వైఓ నందన్ అధికారులను ఆదేశించారు. ఎస్ఎంసీ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ విభాగానికి ఇంటింటి చెత్త సేకరణకు అవసరమైన వాహనాలను సమకూర్చి, వాటి నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్లు చూసుకోవాలని తెలిపారు. అన్ని ప్రధాన డివిజన్లలో అవసరమైన డివైడర్ల నిర్మాణం, డివైడర్ల పెయింటింగ్ పనులు, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు పెయింటింగ్ పనులను నిర్దేశించిన సమయానికి పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈలు శేషగిరిరావు, రహంతు జానీ, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు, డీఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి

నెల్లూరు (పొగతోట): నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్లో మరుగుదొడ్లను వ్యాపారులు, రైతులకు ఉపయోగపడేలా అందుబాటులోకి తీసుకురావాలని సీఐటీయూ రూరల్ కార్యదర్శి పెంచలనర్సయ్య కోరారు. ఈ మేరకు అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ అధికారులకు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూరగాయల మార్కెట్లో మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. దీని వల్ల మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందరికీ ఉపయోగపడేలా మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, కోనేరు మార్కెట్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

వేడుకగా హనుమంతసేవ

నెల్లూరు(బృందావనం): వేదాయపాలెంలోని గురువాయూర్ మహావిష్ణుస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హనుమంతసేవను విశేషంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహాకుంభారాధన, నిత్యహోమం, నివేదన, శాత్తుమొరై, మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం, లక్ష్మీయాగం, లక్ష్మీగాయత్రి హోమాలు, అర్చనలు, పూజలు చేశారు. ఉభయకర్తలుగా తలమంచి వెంకటేశ్వరరావు– వెంకటసునీత, దాసరి ఆంజనేయులు– రంజని, కొలుసు సోమశేఖర్– వాసంతి, వరిదిరెడ్డి నవీన్‌రెడ్డి– చాందిని దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కోశాధికారి జి.రత్నయ్య తదితరులు పర్యవేక్షించారు.



పాత బకాయిలకు మినహాయింపు ఇవ్వాలి

నెల్లూరు (టౌన్): ప్రొఫెషనల్ ట్యాక్స్‌కు సంబంధించి పాత బకాయిలకు మినహాయింపు ఇవ్వాలని ట్యాక్స్ అసోసియేషన్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ కోరారు. ఈ మేరకు స్థానిక జీఎస్టీ కార్యాలయంలో ఉప కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఆదాయాన్ని బట్టి నాలుగు శ్లాబులుగా విభజించి ట్యాక్స్ కటింగ్ చేస్తామని చెప్పారన్నారు. ఎక్కువ మంది ఏజెంట్లు మొదటి రెండు శ్లాబుల్లో ఉండే విధంగా న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసింహారావు, వెంకటరావు, మేకల నరసింహారావు, హాజరత్‌రెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు, జానకి రామయ్య, రంగారావు, నరసయ్య, విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణయ్య, రమేష్ పాల్గొన్నారు.



ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

అదనపు విద్యుత్ లోడ్‌పై అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అదనపు విద్యుత్‌లోడ్ క్రమబద్ధీకరణపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డికాలనీ పరిసర ప్రాంతాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ చంద్ర ఆచారి ఆధ్వర్యంలో వినియోగదారుల నివాసాలకు వెళ్లి విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విద్యుత్ సర్వీసు కనెక్షన్ కోసం తీసుకున్న లోడ్ కంటే నేడు అదనంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారని, అయితే దీనిని గుర్తిస్తే కిలోవాట్‌కు రూ.2 వేలు పెనాల్టీ వేస్తామని, స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకుంటే 50 శాతం రాయితీతో రూ.వెయ్యి చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎల్ఎం సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆధునిక పద్ధతుల్లో మోకాలి శస్త్రచికిత్సలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రోబోటిక్ విధానంతో అత్యాధునిక పద్ధతుల్లో మోకాలి కీలు మార్పిడి ఆపరేషన్లు నూరు శాతం విజయవంతంగా చేస్తున్నామని ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్లు బీఎల్ఎస్ కుమార్ బాబు, కె.శశిధర్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, సందేశ్ రెడ్డి తెలిపారు. మోకాలు కీలు నొప్పులు, అరుగుదల, శస్త్ర చికిత్సలు వల్ల కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై గురువారం ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవన విధానం, ఆహారపు అలవాట్లతో కీళ్లవాతం, గాయాలు తగలడం వల్ల తక్కువ వయస్సులోనే మోకాళ్ల నొప్పులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. మెడికవర్ ఆస్పత్రిలో రోబోటిక్ విధానంలో చేసే ఆపరేషన్లలో పూర్తి ఖచ్చితత్వంతో ఇంప్లాంట్స్‌ను అమర్చవచ్చన్నారు. ఎలాంటి నొప్పి లేకుండా రక్తస్రావం జరగకుండా, పెద్దగా కోత లేకుండా ఖచ్చితంగా ఇంప్లాంట్స్ అమర్చుతామన్నారు. ఫిజియో ద్వారా రోగి వేగంగా కోలుకునేలా చేస్తామన్నారు.